క్లుప్తంగా

నేడు సీకాంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని సీకాం డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఉదయం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు విద్యాసంస్థల చైర్మన్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అపోలో ఫార్మసీలో ఉద్యోగాలకు ఆ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డీ.ఫార్మసీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల లోపున్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9154301852లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లికానుక అందజేస్తున్న చిట్టిబాబు నాయుడు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరులో త్వరలో పెళ్లి చేసుకోనున్న వరుడు నజీర్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని ఆదివారం వైఎస్సార్ సీపీ కుప్పంబాదూరు డివిజన్ అధ్యక్షుడు చిట్టిబాబు నాయుడు, పీహెచ్‌సీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మారయ్య, చంద్రగిరి నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సెంథిల్ కుమార్ అందజేశారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న చేగు లక్ష్మీనారాయణ గుప్తా

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం రాయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అధినేత చేగు ప్రశాంత్ గుప్తా రూ.1,01,116ల విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ రామకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 192 మందికి ఉద్యోగాలు



విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తున్న డీవీఎస్.చక్రవర్తిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో 192 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎ.ఉష తెలిపారు. ప్రముఖ బహుళ జాతి సంస్థ ఈఓఎస్ గ్లోబ్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన 192 మందికి కళాశాల చైర్మన్ డీవీఎస్.చక్రవర్తిరెడ్డి ఆఫర్ లెటర్లు అందజేసి అభినందించారు.

అప్టసా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆనందరావు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్య ఉద్యోగుల సంఘం (అప్టసా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డి.ఆనందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం విజయవాడలో సమావేశం నిర్వహించారు.

విజేతలకు బహుమతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జీవకోనలోని విశ్వం పాఠశాలలో ఆదివారం మొదటి సౌత్ జోన్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఇందులో మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు అందజేశారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురువారెడ్డి, కార్యదర్శి విజయకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా రా ఎన్‌టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్: సమాజ శ్రేయస్సే లక్ష్యంగా రా ఎన్‌టీఆర్ ట్రస్ట్ కృషి చేస్తోందని ట్రస్ట్ వ్యవస్థాపకులు సాయి రూప్ నల్లూరి, దుర్గాప్రసాద్ కొల్లూరి తెలిపారు. వారు ఆదివారం తిరుపతిలో ఓ ప్రైవేటు హోటల్లో జూనియర్ ఎన్‌టీఆర్ పేరున ఉన్న జయహో జనతా పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జూనియర్ ఎన్‌టీఆర్‌పై ఉన్న అభిమానంతో 2021 లో ట్రస్టును ప్రారంభించినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో 50 ప్రాంతాల్లో నిత్యాన్నదానం చేసినట్టు వెల్లడించారు. సేవ చేయాలనే సంకల్పం ఉన్నవారు ఎవరైనా ట్రస్ట్‌లో సభ్యులుగా చేరవచ్చని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

భాకరాపేట: భాకరాపేట శివారు ప్రాంతంలో ఆదివారం బైక్‌ను టిప్పర్ ఢీకొంది. దిగవూరుకు చెందిన శ్రీనివాసులు భాకరాపేట నుంచి ఇంటికి వెళుతుండగా సబ్‌స్టేషన్ సమీపంలో టిప్పర్ ఢీకొంది. శ్రీనివాసులు ముక్కుకు గాయమైంది. అతన్ని ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దాం
- 50వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిస్తాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డితో కలిసి 50వ డివిజన్‌లోని భూపాల్ లేవుట్, తిమ్మినాయుడుపాళెం ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు రాయలసీమ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని బరిలో దింపారని తెలిపారు. గ్రాడ్యుయేట్లు అందరూ ఆయనకు ఓటు వేసి జగనన్నకు కానుకగా ఇద్దామని కోరారు. నేటి యువత కూడా జగనన్నతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకంతో ఉన్నారన్నారు. టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్ కుమార్, హనుమంత్‌నాయక్, వార్డు అధ్యక్షుడు ఆదం సాయికృష్ణారెడ్డి, నింద్ర కుప్పయ్య, టౌన్ బ్యాంకు డైరెక్టర్ వేమూరి జ్యోతిప్రకాష్, నాయకులు ఆదం సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, దొరైరాజ్, చందురాయల్, యువరాజ్, బుజ్జయ్య, రమణయాదవ్, చంగల్‌రాయులు పాల్గొన్నారు.

రోడ్లతోనే నగరం అభివృద్ధి



రోడ్డు పనులపై సూచనలు చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- త్వరలో అందుబాటులోకి మాస్టర్ ప్లాన్ రోడ్లు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా : ప్రముఖ నగరాల అభివృద్ధికి సరైన కనెక్టివిటీ, రోడ్లే కారణమని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన ఆదివారం అధికారులు, కార్పొరేటర్లతో కలసి తిరుపతి నగరంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరానికి సరైన కనెక్టివిటీ, రోడ్లు లేకపోవడం శాపంగా మారిందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న తిరుపతి మరింత విస్తరించాలంటే సరైన టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఇన్ ఫస్ట్ స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అవసరమని గుర్తించామన్నారు. ఏక కాలంలో 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తుండడంతో తూర్పు ప్రాంతానికి పదింతల విలువ పెరిగిందన్నారు. తద్వారా నగరానికి కనెక్టివిటీతోపాటు దాదాపు 3,500 ఎకరాల్లో నగరం విస్తరించనుందన్నారు. మరో నాలుగు, ఐదేళ్లలో తూర్పు ప్రాంతంలో మాల్స్, హాస్పిటల్స్, స్కూల్స్, కాలేజీలు, బహుళ అంతస్తుల భవనాలు ఏర్పడనున్నాయని వివరించారు. నగరం నడిబొడ్డున ఇరుకు రోడ్లలో ఉండే భారీ వ్యవస్థలు నగర శివారు ప్రాంతాలకు పోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్య సైతం తగ్గుతుందని చెప్పారు. రోడ్ల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. కార్పొరేటర్ పుల్లూరు అమర్నాథ్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా నాయకుడు బాలిశెట్టి కిషోర్‌రాయల్, నాయకులు పులికంటి గోపీనాథ్ రెడ్డి, వంశీ, మద్దాలి శేఖర్, చక్రి పాల్గొన్నారు.

నేటి నుంచి రామలింగ చాముండేశ్వరి కుంభాభిషేకం





విద్యుత్ వెలుగుల్లో రామలింగ చాముండేశ్వరిదేవి ఆలయం, ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహం

తిరుపతి రూరల్: మండలంలోని పుదిపట్లలో నిర్మించిన రామలింగ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి 16 వరకు విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయంలో విశేష పుష్పాలంకరణ చేపట్టారు. గ్రామం మొత్తం దేవతామూర్తుల రూపాలతో చేపట్టిన విద్యుత్ అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది. కుంభాభిషేకంలో భాగంగా మొదటిరోజు సోమవారం సాయంత్రం 4 గంటలకు గంగను, పుట్టమన్నును ఊరేగింపుగా తీసుకువస్తారు. రాత్రి గణపతి పూజ, రక్షాబంధన, ధ్వజారోహణం, అంకురార్పణ, జలాధి వాసం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 4 నుంచి రామలింగ చౌడేశ్వరి అమ్మవారు, గణపతిస్వామి, సుబ్రమణ్యస్వామి, మహాలక్ష్మి, సరస్వతీదేవి, పార్వతీదేవి, గర్భగుడి గోపుర కలశ ప్రతిష్ఠ, 108 కలశాలకు పూజను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. మూడోరోజు బుధవారం మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, అష్టపదన సేవ, మంత్రపుష్పం, మహామంగళ హారతి, గురువారం మధ్యాహ్నం అమ్మవారి ప్రసన్నం, పూజా కార్యక్రమం నిర్వహించి, రాత్రి అమ్మవారి ఊరేగింపు, అలుగు సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు పన్నెం వాసు, బీరకం మనోహర్, పన్నెం జగదీశ్వరయ్య, బీరకం శేఖర్, మారెం మురళి, విజయ్‌కుమార్, తిరుమల తెలిపారు.

వడ్డెరల సంక్షేమానికి కృషి



తురక అమర్నాథ్



కోనంగి శ్రీరాములు

తిరుపతి కల్చరల్: వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘం నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతికి చెందిన తురక అమర్నాథ్, కోనంగి శ్రీరాములు తెలిపారు. మహిళా ప్రాంగణంలో ఆదివారం ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర జేఏసీ చైర్మన్ వేముల సుబ్బారావు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వడ్డెర నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని వడ్డెర సామాజిక వర్గాన్ని ఐక్యం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోగ్య క్రమశిక్షణతో మెరుగైన సమాజం

తిరుపతి కల్చరల్: జీవితంలో ఆరోగ్య క్రమశిక్షణ అంతర్భాగం కావాలని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని హైదరాబాద్‌కు చెందిన నిమ్స్ చీఫ్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ భూషణ్ రాజు తెలిపారు. జీవనశైలిని మార్చుకోకపోతే రాబోయే కొన్నేళ్లలో దేశం క్యాన్సర్ ముప్పును ఎదుర్కోకతప్పదని హెచ్చరించారు. టీటీడీ ఉద్యోగులకు జీవనశైలి, రుగ్మతులు, వ్యాధులు అనే అంశంపై మహతిలో చేపట్టిన అవగాహన సదస్సు ఆదివారం రెండో రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ డయాబెటిస్‌ను త్వరగా గుర్తిస్తే ఎక్కువ నష్టం కలుగకుండా చూసుకోవచ్చన్నారు. ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రేణు దీక్షిత్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానాల ద్వారా జీవనశైలి రుగ్మతులు, వ్యాధులను చక్కగా ఎదుర్కోవచ్చన్నారు. ఎస్వీ వేద వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, స్విమ్స్ కార్డియాలజిస్ట్ వనజాక్షమ్మ, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, ఈఈ మనోహరం, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, గోవిందరాజన్, ఆనందరాజు, డీఎఫ్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే భూమన



యువతతో సరదాగ క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదివారం 50వ డివిజన్ భూపాల్ లేవుట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడి మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువకుల చూసి తానూ యువకుడిలా మారిపోయారు. వారితో కొంతసేపు సరదాగా క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. చదువుకున్న ప్రతి యువతే దేశానికి వెన్నెముక అని, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. యువకులు అక్కడే ఉన్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో సెల్ఫీలు తీసుకున్నారు.

తలకోన ఆలయ చైర్మన్ కన్నుమూత



ఉమామహేశ్వర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



కోడి ఉమామహేశ్వర రెడ్డి(ఫైల్)

ఎర్రావారిపాళెం: తలకోన ఆలయ పాలక మండలి చైర్మన్ కోడి ఉమామహేశ్వరరెడ్డి ఆదివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం స్వగ్రామం ఎర్రావారిపాళెం మండలం యల్లమందకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. ఉమామహేశ్వర్‌రెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



చంద్రగిరి: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



రామచంద్రాపురం: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1996–97లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని, తరచూ పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. సతీష్, ముని, బలరాం, గురునాథం, ఈశ్వర్, కళంధర్, గోపి, రవి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో

రామచంద్రాపురం: మండలంలోని పరమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–1996లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. స్నేహితులతో సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తాము విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరి, విశ్రాంత హెచ్‌ఎం జగన్నాథరెడ్డి, లక్ష్మీపతి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి రూరల్: తిరుపతి జేసీఐ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గసముద్రం పంచాయతీలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నవ్య నేత్రాలయ, ఫ్యామిలీ ట్రీ క్లినిక్ ఆస్పత్రుల వైద్యులు 209 మంది రోగులకు థైరాయిడ్, షుగర్ తదితర 18 రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యంగా పల్లెల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జేసీఐ అధ్యక్ష, కార్యదర్శులు గౌతమి, శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావణ్ కృష్ణరెడ్డి, హర్షిత, రాజ్‌యశ్వంత్ పాల్గొన్నారు.



15 నుంచి తలకోన బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- 19న సిద్ధపూజ మహోత్సవం



ఎర్రావారిపాళెం: తలకోన సిద్ధేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 15న ప్రారంభమై 19న సిద్ధపూజతో ముగుస్తాయి. భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో జయకుమార్ తెలిపారు. రాత్రి జాగరణ, వరపడుట, పార్కింగ్, తాగునీరు, సాంస్కృతిక కార్యక్రమాలు, దర్శన క్యూలైన్లు, అంగళ్ల నిర్వహణ, అన్నదానం తదితర కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు సౌకర్యంగా అన్ని మార్గాల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

- 15న మహాగణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన, రుద్ర పారాయణం, సాయంత్రం 4 గంటలకు నందీశ్వరుడికి అభిషేకం, ధ్వజారోహణం చేపడతారు.
- 16న మహాగణపతి పూజ, సుబ్రమణ్యస్వామికి సహస్రనామ కుంకుమార్చన, మహాగణపతి హోమం, రుద్ర హోమం, నవగ్రహ హోమం, మహామృత్యుంజయ హోమం, సాయంత్రం 6 గంటలకు వేదపారాయణం, సిద్ధేశ్వరిదేవికి సహస్ర నామ కుంకుమార్చన, రుద్ర హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు.
- 17న ఉత్సవమూర్తులకు అభిషేకం, నక్షత్ర హోమం, సాయంత్రం 6 గంటలకు నెరబైలులో సిద్ధేశ్వరి అమ్మవారి సమేత సిద్ధేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం ఉంటాయి.
- 18న సిద్ధేశ్వరి అమ్మవారి సమేత సిద్ధేశ్వర స్వామి వారికి ఉదయాత్పూర్వం 3 గంటలకు రుద్రాభిషేకం, 5 గంటలకు స్వామి, అమ్మవార్ల సర్వదర్శనం ఉంటాయి. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, సాయంత్రం 7 గంటలకు ఊరేగింపు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ పుణ్యాకాలలో మహాన్యాసపూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం చేస్తారు.
- 19న మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అభిషేకం, అలంకరణ, సర్వదర్శనం, 11 గంటలకు సిద్ధపూజ కార్యక్రమం ఉంటాయి.

కల్యాణ వెంకన్న వైభవం



మురళీకృష్ణుడిగా..



సరస్వతీదేవి అలంకరణలో...

శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. స్వామి వారు ఆదివారం ఉదయం మురళీకృష్ణుడిగా చిన్న శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అదేవిధంగా రాత్రి స్వామివారు సరస్వతీదేవి అలంకరణలో హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. - చంద్రగిరి



చిన్నారుల కోలాటం

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రంగారావు, జస్టిస్ రవీంద్రబాబు, తెలంగాణ న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు ప్రసాదాలతో సత్కరించారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్టు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లుకు చెందిన చంద్రశేఖర్ గ్రామ చావిడి వద్ద ఉండగా ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రకాష్ ఆదివారం తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లా పీలేరు మండలం గూడరేవుపల్లి తండాకు చెందిన దేశనాయక్ వద్ద 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు.

